తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT


సంపుటి: 1 సంచిక: 86 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 31-10-2024 వెల: 5/రూ -







# జనగణనలోనే.. ఓబీసీ కులగణన



కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం
నవంబర్ 2న అన్ని జిల్లాల్లో అభిప్రాయ సేకరణకు సమావేశాలు
మేధావులు, సామాజికవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయం
5 లేదా 6వ తేదీన రాహుల్‌గాంధీని ఆహ్వానించి సభ నిర్వహణకు యోచన
కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు.. మెగా హెల్త్ చెకప్ లాంటిది: సీఎం
పార్టీ నాకు అన్నీ చేసింది.. నేను పార్టీకి, ప్రజలకు సేవ చేయడమే మిగిలింది
ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
కులగణన పార్టీకి ఎలా ఉపయోగపడుతుందో వివరించిన కొప్పుల రాజు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది నిర్వహించనున్న జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం తీర్మానం చేసింది. రాష్ట్రంలో వచ్చే నెల ఆరోతేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన కులగణనపై చర్చించేందుకు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీనిని ఆమోదించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ నేత కొప్పుల రాజుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కులగణన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి ఎలా ఉపయోగపడుతుందన్న అంశాన్ని ఏఐసీసీ నేత కొప్పుల రాజు వివరించారు. ఆ కార్యక్రమంలో పార్టీ శ్రేణులను భాగస్వాములను చేయాలని సూచించారు.



10లో

## నేడు, రేపు వానలు


విశాఖపట్నం: దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి ఒడిశా వైపు కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం బలహీనపడింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న దక్షిణాంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 3.1 కిలోమీటర్ల మధ్య విస్తరించి కొనసాగుతోంది.



2లో

## అయోధ్య దీపోత్సవం.. రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు


## ‘అలా చేయటం.. నన్ను ఎంతో బాధపెట్టింది’



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తనను అనుకరించటం

# ముందు నీ కుర్చీ కాపాడుకో

నీ పక్కన ఉన్నవారు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో
ఆ తర్వాత మమ్మల్ని డీల్ చేసే విషయం ఆలోచించు
సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కౌంటర్
ఐదేళ్ల తర్వాత నిన్నెలా డీల్ చేయాలో మాకు తెలుసు
మూసీ పాదయాత్రకు నేనూ,కేటీఆర్ రెడీ..డేట్, టైం చెప్పు
మీడియాతో ఇష్టాగోష్టిలో మాజీమంత్రి వ్యాఖ్యలు



హైదరాబాద్: ‘రేవంత్‌రెడ్డీ.. ముందు నీ కుర్చీకింద ఉన్న బాంబు గురించి చూసుకో.. నీ పక్కన ఉన్నవారు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో.. నీ మంత్రులే నిన్ను ముంచుతారు. ఒకరేమో రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. మరొకరు ఢిల్లీలో అధిష్టానం వద్దకు రహస్యంగా వెళ్లివస్తున్నారు. మరొకరు హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను డీల్ చేయడం తర్వాత.. ముందు నీవు ఐదేళ్లు పదవిలో ఉండేలా చూసుకో.. ఐదేళ్ల తర్వాత నిన్ను ఎలా డీల్ చేయాలో మాకు తెలుసు. ఏడాది అవుతోంది.. మంత్రివర్గ విస్తరణ చేసుకోలేవు. కనీసం చీఫ్‌విప్, డిప్యూటీ స్పీకర్‌ను నియమించుకోలేకపోయావు..

2లో



## ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

2లో

# స్వర్ణాంధ్ర సాధనకు 12 సూత్రాలు

స్వర్ణాంధ్ర సాధనకు12 సూత్రాలు.. ‘వికసిత్ భారత్’కుసమాంతరంగా ‘విజన్ 2047’



ఏఐ, రోబోటిక్స్ నాలెడ్జ్ సిటీలుగా అమరావతి, తిరుపతి, విశాఖ
నీతి ఆయోగ్ బృందానికి చంద్రబాబు ప్రజెంటేషన్
ప్రజారోగ్యమే ఫస్ట్.. సాంకేతికత, ఉపాధికి ప్రాధాన్యం
డిమాండ్ - సప్లై ఆధారంగా నైపుణ్యాల మెరుగుదల
ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం
18 లక్షల మంది సూచనలతో ‘విజన్’ డాక్యుమెంట్
క్లీన్ ఎనర్జీలో 7.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల మందికి ఉపాధి లక్ష్యం.. పాలసీ డాక్యుమెంట్ విడుదల

## బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వండి

టెక్నాలజీ, తయారీ రంగాల్లో సహకరించండి
ఇంద్రానూయి, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవోతో లోకేశ్ భేటీ



2లో

## మయోనైజ్‌పై నిషేధం

వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు
ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు మయోనైజ్ కారణమని గుర్తింపు
ఆహార కల్తీపై ఫిర్యాదులకు కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్: మంత్రి దామోదర రాజనర్సింహ



2లో

హైదరాబాద్: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న మయోనైజ్ వినియోగంపై ఏడాది పాటు నిషేధం విధిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# జనగణనలోనే.. ఓబీసీ కులగణన

(మొదటి పేజీ తరువాయి)

ఇక వచ్చే నెల 2న కులగణన అంశంపై జిల్లా స్థాయిలో డీసీసీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని.. భాగస్వామ్య పక్షాలను ఆహ్వానించి విస్తృతస్థాయి చర్చ జరపాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే నెల 5న లేదా 6న రాష్ట్రస్థాయిలో మేధావులు, సామాజికవేత్తలు, ముఖ్యులతో భేటీ జరపాలని.. వారిచ్చే సలహాలు, సూచనలకు అనుగుణంగా కులగణన ప్రక్రియపై ముందుకెళ్లాలని ఆలోచనకు వచ్చారు. కులగణనపై రాష్ట్రంలో సభ నిర్వహించాలని, దీనికి రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని నిర్ణయించారు. సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటైన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన చేస్తామని గత ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గాంధీ కుటుంబం ఒకమాట ఇస్తే ఎవరు అడ్డువచ్చినా నెరవేర్చి తీరుతుంది. అప్పుడు తెలంగాణ ఏర్పాటు ద్వారా, ఇప్పుడు కులగణన ద్వారా ఇది నిరూపితమైంది.." అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని.. ఈ క్రమంలో ప్రతిక్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులు, నాయకులపై ఉందని చెప్పారు. కులగణనలో భాగస్వాములను చేసేందుకు 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను నియమించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు రేవంత్ సూచించారు. కులగణన విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్ కావాలని, ఈ మోడల్ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేసే క్రమంలో ఎవరు అడ్డు వచ్చినా, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కులగణన కేవలం ఎక్స్‌రే మాత్రమే కాదని.. మెగా హెల్త్ చెకప్ వంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమన్నారు. నవంబర్ 31లోగా రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి తెలంగాణ నుంచే నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా ఓబీసీల కులగణన చేపట్టడం కోసం.. రాష్ట్రంలో జరిగే కులగణన డాక్యుమెంట్‌ను పంపుతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కావాలన్నది కాంగ్రెస్ పార్టీలోని బీసీల నినాదమని.. అయితే గ్రూప్%-%1 మెయిన్స్‌కు 57 శాతం మంది బీసీలు ఎంపికయ్యారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అగ్రవర్ణాలతోపాటు బీసీలు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కోటాల కింద ఎంత మంది గ్రూప్%-%1 మెయిన్స్‌కు ఎంపికయ్యారన్న విషయాన్ని వివరించారు. నవంబర్ ఆరో తేదీ నుంచి చేపట్టనున్న కులగణన కార్యక్రమాన్ని 30వ తేదీలోగా పూర్తి చేస్తామని.. తర్వాత ఈ వివరాలన్నింటినీ హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఆ రోజుకల్లా స్థానిక రిజర్వేషన్లపై కోర్టు తీర్పు వస్తే, డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సంబురాలు జరుపుకోవాలని పేర్కొన్నారు.

**నాకు పార్టీ అన్నీ చేసింది..**

కాంగ్రెస్ పార్టీ తనకు అన్నీ చేసిందని, ముఖ్యమంత్రిని చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు మిగిలింది తాను పార్టీకి, ప్రజలకు సేవ చేయడమేనని చెప్పారు. ఈ క్రమంలోనే పార్టీ విధానాన్ని పాటించేందుకు కులగణన చేపడుతున్నామన్నారు. పార్టీ అధికారంలోకి రాకముందు అనుబంధ సంఘాల అధ్యక్ష పదవులు తీసుకోవాలని కోరితే కొందరు ముందుకు రాలేదని.. ఇప్పుడు వారే తాము పెద్ద నాయకులమని, పదవులు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు.

## అయోధ్య దీపోత్సవం.. రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు

(మొదటి పేజీ తరువాయి)

లక్నో: అయోధ్యలో అట్టహాసంగా నిర్వహించిన దీపోత్సవ వేడుక బాల రాముడి సాక్షిగా రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. సరయూ నది తీరంలో అధిక సంఖ్యలో భక్తులు ఏకకాలంలో దీపాలతో హారతి ప్రదర్శించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 25,12,585 దీపాలను భక్తులు వెలిగించి రికార్డు సృష్టించారు. అతిపెద్ద నూనె దీపాల ప్రదర్శనకు గాను మరో గిన్నిస్ వరల్డ్ రికార్డును అయోధ్య దీపోత్సవం సాధించింది. గిన్నిస్ ధ్రువీకరణ పత్రాలు ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అందుకున్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కన్సల్టెంట్ నిశ్చల్ బరోట్ నేతృత్వంలోని 30 మంది బృందం 55 ఘాట్‌లలో డ్రోన్‌లను ఉపయోగించి దీపాలను లెక్కించింది.

## బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: బ్రాండ్ ఏపీ రూపకల్పనకు మద్దతివ్వాలని, టెక్నాలజీ, తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులకు సహకరించాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న ఆయన లాస్‌వేగాసలోని ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో పెప్సికో మాజీ సీఈవో ఇంద్రానూయి, సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షియాతో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. ఇంద్రానూయితో భేటీ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టెక్నాలజీ, తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతివ్వాలని కోరారు. విద్య, సాంకేతిక ఆధారిత నైపుణ్యాల అభివృద్ధితో యువతకు సాధికారత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. నైపుణ్యం కలిగిన యువత వారి కెరీర్‌లో విజయం సాధించడానికి దోహదపడే మెంటరింగ్ ప్రోగ్రామ్‌లను రూపొందించాలని కోరారు. ఏపీలో సాంకేతిక పర్యావరణ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా చూడటానికి ఒకసారి రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు. మంత్రి ప్రతిపాదనలపై ఇంద్రానూయి సానుకూలంగా స్పందించారు. ఏపీలో పెట్టుబడులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## స్వర్ణాంధ్ర సాధనకు 12 సూత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: 'స్వర్ణాంధ్ర - 2047' సాధనకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు 12 సూత్రాలను నిర్దేశించారు. ఆ లక్ష్యాలను చేరుకోవడం ద్వారా 2047 నాటికి రాష్ట్ర రూపు రేఖలు మార్చేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనిపై బుధవారం సచివాలయంలో నీతి ఆయోగ్ ప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో నీతిఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంతో పాటుపలువురు అధికారులు పాల్గొన్నారు. 'వికసిత్ భారత్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రధాని మోదీ వచ్చేనెల ఆవిష్కరించనున్నారు. రాష్ట్రాల అభిప్రాయాలు, లక్ష్యాలను గుర్తించడంలో భాగంగా బుధవారం నీతి ఆయోగ్ ప్రతినిధులు బుధవారం ఏపీకి వచ్చారు. 'వికసిత్ భారత్-2047'కు సమాంతరంగా 'స్వర్ణాంధ్ర' సాధనను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై 18 లక్షల మంది ప్రజల నుంచి వచ్చిన సూచనలను క్రోడీకరించి 'విజన్- 2047'లో చేర్చామని చంద్రబాబు చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని... అందుకే ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామని చెప్పారు. ఏఐ, రోబోటిక్స్ నాలెడ్జ్ సిటీలుగా అమరావతి, తిరుపతి, విశాఖలను తీర్చిదిద్దుతామన్నారు. గతంలో ఇంటికొక ఐటీ ఉద్యోగి ఉండాలన్న లక్ష్యంతో పనిచేసి ప్రజల తలసరి ఆదాయం పెంచామని,

## ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి సందర్భంగా తీపికబురు చెప్పింది. డీఏ 3.64శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2022 జూలై ఒకటో తేదీ నుంచి వర్తించనున్నది. డిసెంబర్ ఒకటిన చెల్లించే నవంబర్ జీతంతో కలిపిన పెరిగిన డీఏ ప్రభుత్వం చెల్లించనున్నది. 2022 జులై ఒకటి నుంచి ఈ నెల వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10శాతం ప్రాన్ ఖాతాకు జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులకు మిగతా 90శాతం 17 వాయిదాల్లో చెల్లించనున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 వాయిదాల్లో చెల్లించినట్లు ప్రభుత్వ పేర్కొన్నది. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగులకు సైతం 17 వాయిదాల్లో చెల్లించనున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలను జనవరి నుంచి 17 వాయిదాల్లో జమ చేయనున్నది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

## ముందు నీ కుర్చీ కాపాడుకో

'అని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్‌ను వాడుకొని కేసీఆర్‌ను ఫినిష్ చేశానని, బావను ఉపయోగించి బామ్మర్దిని ఫినిష్ చేయిస్తానంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'నీ సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్షే. నీకు, కేసీఆర్‌కు పోలికా? నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఆయన త్యాగశీలి, సాధనాపరుడు. ఆయన ఉద్యమం చేసి తెలంగాణ తేకుంటే నీవు సీఎం అయ్యేవాడివే కాదు. నోరు తెరిస్తే అబద్ధాలు. నిన్ను చూస్తే గోబెల్స్ కూడా సిగ్గుపడేవాడు. ఒక్క హామీని నిలబెట్టుకోలేదు. రుణమాఫీ పాక్షికంగానే చేశావు. 31 రకాల కోతలతో రుణమాఫీని గణనీయంగా తగ్గించావు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు 100 సీట్లు వస్తాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోల్ చేసేది, వికెట్ తీసేది మేమే. కేసులకు భయపడం. హామీలు ఎగవేసిందుకు నేను సీఎంను ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటే నాపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. బుల్డోజర్లు నడిపించి చంపేస్తామని సీఎం అంటే ఆయనపై మాత్రం కేసు నమోదు చేయడం లేదు..'అని హరీశ్ అన్నారు. 'మూసీ సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు. పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్ల కూల్చివేత, రియల్ ఎస్టేట్‌కు అప్పగించడం, కమీషన్లకు మాత్రమే వ్యతిరేకం. టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి వాడపల్లి వరకు పాదయాత్రకు నేను, కేటీఆర్ రెడీ.. తేదీ, సమయం చెప్పు. ఎవరూ లేకుండా వెళ్దాం. మల్లన్నసాగర్ కోసం 50 వేల ఎకరాలు ముంపునకు గురైందంటూ అన్నీ అసత్యాలే చెప్పావు. మేము సేకరించిందే 17 వేల ఎకరాలు. అందులో 3 వేలకు పైగా ప్రభుత్వ భూమి. మల్లన్నసాగర్ నిర్వాసితులకు మేం 2013 భూ సేకరణ చట్టం కంటే ఎక్కువ ఇచ్చాం. అయినా తక్కువ ఇచ్చామని ఆరోపించారు కదా.. అంతకంటే ఎక్కువ మీరు మూసీ నిర్వాసితులకు ఇవ్వండి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎందుకు? గచ్చిబౌలిలో 250 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వండి. వారి ఉపాధికి ఒక్కో కుటుంబానికి రూ.7.5 లక్షలు ఇవ్వండి. పెళ్లి కానివారికి రూ.5 లక్షలు, ఇంటి స్థలం ఇవ్వండి. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయలేవు. సందర్శకులు రాకుండా తాళం వేశావు. ఇప్పుడు మూసీలో మహాత్మాగాంధీ విగ్రహం పెడ్తానంటున్నావు. మూసీ సుందరీకరణకు కేసీఆర్ ముందే ప్రణాళికలు వేశారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీలోకి తీసుకుని రావడానికి రూ.1100 కోట్లతో ప్రణాళిక చేస్తే.. నీవు మరింత దూరం వెళ్లి మల్లన్నసాగర్ అంటూ రూ.7,000 కోట్లకు పెంచావు. ఎందుకంటే నీ కమీషన్ల కోసం..'అని మాజీమంత్రి ఆరోపించారు.

## మయోనైజ్‌పై నిషేధం

2025 అక్టోబర్ చివరివరకూ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా జరిగిన అనేక ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలకు పచ్చిగుడ్లతో చేసిన మయోనైజ్ కారణమని గుర్తించామని పేర్కొన్నారు. మయోనైజ్ సాధారణంగా శాండ్‌విచ్‌లు, సలాడ్‌లు, స్నాక్స్ వంటి వాటిల్లో రుచి కోసం వినియోగిస్తారు. గ్రిల్డ్, తందూరి చికెన్, కబాబ్‌లు వంటి వాటితో కూడా కలిపి తీసుకుంటుంటారు. (ఆహార భద్రతపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం సమీక్ష నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, గోడౌన్లలో తనిఖీలు చేశామని, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వివరించారు. దీంతో జిల్లాల్లోనూ విరివిగా తనిఖీలు చేయాలని, ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి ఆరా తీశారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయోనైజ్‌ను కల్తీ గుడ్లు, ఉడకబెట్టని గుడ్లతో తయారు చేస్తున్నారని, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు.

## జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీ కేసులో ముగిసిన రాజ్ పాకాల పోలీస్ విచారణ



**శంకర్ పల్లి అక్టోబర్ 30:(డైలీ రిపోర్ట్):** ఫామ్‌హౌస్ కేసులో ముగిసిన రాజ్ పాకాల పోలీస్ విచారణ రాజ్ పాకాలను 9 గంటలపాటు విచారించిన మోకిల పోలీసులు రాజ్ పాకాల స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులుBNSS 35(3) సెక్షన్ కింద రాజ్ పాకాలకు నోటీసులువిజయ్ మద్దూరి స్టేట్‌మెంట్ ఆధారంగా కొనసాగిన విచారణవిచారణ మధ్యలో రాజ్ పాకాలను.ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లిన పోలీసులు ఫామ్‌హౌస్‌లో గంటపాటు పోలీసుల సోదాలుగతంలో జరిగిన పార్టీలపై పోలీసుల ఆరా.

## సిపిఐ 100 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలి

పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు



**శంకర్ పల్లిబీ అక్టోబర్ 30:(డైలీ రిపోర్ట్):** భారత కమ్యూనిస్టు పార్టీ 19 25 డిసెంబర్ 25న భారతదేశంలో ఆవిర్భవించింది అని 2024 డిసెంబర్ 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారతదేశంలో ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని దీనిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిపిఐ చరిత్రను వివరించాలని జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్ల పట్టణంలో జరిగిన సిపిఐ మండల కార్యదర్శిల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో సిపిఐ ఏర్పడిన కాలంలో రాజరిక వ్యవస్థలు బ్రిటిష్ పాలకుల అకృత్యాలు దుర్మార్గాలు కొనసాగుతున్న కాలంలోనే సిపిఐ వాటికి వ్యతిరేకంగా పోరాడి ప్రజలను దేశాన్ని కాపాడిన చరిత్ర సిపిఐ పార్టీ దని కొనియాడారు. వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాపితంగా అన్ని మండల కేంద్రాలలో సభలు సమావేశాల ద్వారా సిపిఐ విశిష్టతను మరింత పెంచాలని పిలుపునిచ్చారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేయనీయడల ఆందోళనలు, పోరాటాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, సిపిఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, పి సుధీర్, శ్రీనివాస్, నక్కలి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు

## నవంబర్ 1 న కొత్తగూడ పాతాళ త్రికోణ మహా సుందరి ఆలయంలో ధనలక్ష్మి మహా హెూమం....



**శంకర్ పల్లిబీ అక్టోబర్ 30:(డైలీ రిపోర్ట్):** నవంబర్ 1న శంకర్‌పల్లి మండలం, పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడ గ్రామ శివారులో వెలసిన పాతాళ త్రికోణ మహా సుందరి ఆలయంలో ఆశ్వయుజ అమావాస్య సందర్భంగా శ్రీ ధనలక్ష్మి మహా హెూమం కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మాధికారి మాధవరెడ్డి తెలిపారు. హెూమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు.



ఆన్లైన్ లో MLC గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు చేపిస్తున్నా తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర నాయకులు.

# జాగ్రత్తలు వహిస్తూ పండగ జరుపుకొండి

**ప్రతి మండలంలో అందుబాటులో 108 సిబ్బంది**

**పలు జాగ్రత్తలతో ప్రమాదాల భారి నుంచి బయటపడే అవకాశం**

**పొగతో శ్వాస సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం**

**108 రాష్ట్ర ఆపరేషన్స్ హెడ్ ఖలీద్**



**మహబూబాబాద్ / కొత్తగూడ, అక్టోబర్ 30 (డైలీ రిపోర్ట్):**దీపావళి అంటే పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఎంతో ఆనందకరంగా జరుపుకునే పండుగ. ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుకుంటూ స్నేహితులు, కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతూ ఉంటారు. ఇట్టి దీపావళి అందరి ఇళ్లల్లో ఆనంద కేళి కావాలంటే పలు జాగ్రత్తలు పలు తప్పక అవసరమని 108 రాష్ట్ర ఆపరేషన్స్ హెడ్ ఖలీద్ సూచిస్తున్నారు. టపాసుల వలన వచ్చే పొగ వల్ల శ్వాసకి సంబంధించిన కేసులు సగటుకంటే అధికంగా పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఉబ్బసం వంటి శ్వాస సమస్యలు ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు వారి పరిసరాల విషయంలో తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. టపాసులు ఇంటికి బయట దూరంగా పేల్చాలని, అధికంగా వచ్చే టపాసులు కాల్చకపోవడం ఎంతో మేలు అని సూచించారు. టపాసులు పేలుస్తున్నప్పుడు శరీరానికి వదులుగా ఉండే నులు దుస్తులను ధరించాలని, కాళ్లకు తప్పనిసరిగా చెప్పులు ధరించాలని, చిన్న పిల్లలు టపాసులు పేల్చే సమయంలో పెద్దలు పక్కన ఉండేలా చూసుకోవాలని, అంతేకాక కంటి అద్దాలు, మాస్క్ ధరించాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా ఈఎంఈ బత్తిని మహేష్.. మాట్లాడుతూ ఎటువంటి ప్రమాదం జరిగిన లేదా కాలిన గాయాలు అయినా వెంటనే 108 ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారంను అందించాలని కోరారు. కాలిన గాయాల పైన సాధారణ చల్లగా ఉండే నీరు 10 నుండి 20 నిమిషాల వరకు పోయాలని, శుభ్రమైన గుడ్డతో గాయాలను కప్పి ఉంచాలని, కాలిన గాయాలకు వైద్యుని సలహా ప్రకారం ఆయింట్మెంట్ రాయాలని సూచించారు.

**ప్రతి మండలంలో అందుబాటులో సిబ్బంది...**

**అత్యవసర సేవల స్టేట్ హెడ్ ఖలీద్**

దీపావళి పర్వదినం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి మండలంలో 108 సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరుగుతుంది. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా వెంటనే 108 కి ఫోన్ చేసి సమాచారంను అందిస్తే వెంటనే ఘటన స్థలానికి వెళ్లి ప్రథమ చికిత్సను అందిస్తూ దగ్గరలోని ఆసుపత్రికి క్షేమంగా తరలిస్తాము. ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి.





## ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎల్లంకీ విద్యార్థి ఎంపిక

**పటాన్ చెరు,అక్టోబర్31 (డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా కిష్టారెడ్డి పేట లోని ఎల్లంకి కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న చందు అనే విద్యార్థికి అమృత్ సర్ లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో ఛాంపియన్షిప్ కి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సదాశివరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలని అన్నారు.ఎల్లంకి కాలేజీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి అమృత్ సర్ లోని ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో ఛాంపియన్షిప్ కు ఎంపికైనందుకు గానూ మేనేజ్మెంట్ అండ్ స్టాఫ్ అభినందనలు తెలియజేశారు.



## శాతావాహన వీసీ ని కలసిన ప్రసన్న హరికృష్ణ

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఫొటోరైటప్- వైస్ ఛాన్సలర్ కలిసిన ప్రసన్న హరికృష్ణ.కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ గా ఇటీవలే నియమితులైన ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ను బుధవారం ప్రసన్న హరికృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల సమస్యలు, వారి భవిష్యత్తు కోసం గుణాత్మక విద్య గురించి విస్తృతంగా చర్చించారు. విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శ నానికి,కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మిత్రులు కలరు.

## రాష్ట్రంలో 06 నుంచి కులగణన



**మహబూబాబాద్, అక్టోబర్ 30(డైలీ రిపోర్ట్):** తెలంగాణ రాష్ట్రంలో జనగణన,కులగణన జనాభా లెక్కలు రిజర్వేషన్లు సంక్షేమ పథకాలు రాజకీయ నేపథ్య వివరాల సేకరణ నవంబర్ 06 నుంచి కులగణన ప్రారంభం కానుందని, దీనికి సంబంధించిన ప్రశ్న వాలిని ప్రభుత్వం విడుదల చేసింది 56 ప్రధాన ప్రశ్నలతో పాటు 19 అనుభంద ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలు ఖరారు చేశారని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ఆదివాసీ తెగలు తమ ఆస్థిత్వన్ని కాపాడుకోవడం కోసం ఏ తెగ ఆ తెగ గుర్తింపు కోసం గోండు కోయ తెగలకు అనుబంధంగా ఉన్న నాయక పొడ్, గుట్ట కోయ, డోలి కోయ లాంటి ఉప తెగలు జనాభా కులగణన లేకల్లో తప్పని సరి పాల్గొనాలి, గోత్తి కోయ గా పిలవబడుతున్న గుట్ట కోయలను గుట్ట కోయగా, గొండ్ హార్జీన్ లో ఉన్న నాయక పో తెగని నాయక పొడ్ తెగ గానే గుర్తించాలి. జనాభా కులగణన లో లెక్కించాలని, ఈ బాధ్యత ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, అధికారులపై ఆధార పడి ఉందని, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు.


## ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగళి శ్రీపాల్ రెడ్డిని గెలిపించుకుందాం



**మహబూబాబాద్ /కొత్తగూడ, అక్టోబర్ 30(డైలీ న్యూస్):** వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి పింగళి శ్రీపాల్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడ మండల పరిధిలోని వివిధ పాఠశాలలలో పింగళి శ్రీపాల్ రెడ్డి మద్దతుగా ఉపాధ్యాయుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏలను వెంటనే చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే మంజూరు చేయాలని,కెజిబివి పాఠశాల ఉద్యోగులకు మినిమం స్కేల్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్ యంఎల్సి ఓటర్ నమోదులో భాగంగా ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇర్ప చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి సువర్ణపాక క్రిష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈసం బాబురావు, కార్యదర్శి వాసం పాపయ్య, జిల్లా కార్యదర్శి పెనక రామస్వామి, మండల అసోసియేట్ అధ్యక్షుడు జాడి ప్రభాకర్, ఆలూరి శంకరయ్య సంఘం ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## క్రిభ్ కో ఆర్ జి బి మెంబర్ ఎన్నికైన డేగ బాబు ను ఘనంగా సన్మానించిన సంఘ సభ్యులు

అనంతగిరి , అక్టోబరు 30(డైలీ రిపోర్ట్):ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ క్రి భ్ కో ప్రాంతీయ మహాజన సభ మెంబర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన డేగ బాబు ను బుధవారం సంఘ సభ్యులు అమీనాబాద్ మాజీ సర్పంచ్ బుధవారం అనంతగిరి ప్రాథమిక వైఎస్ఆర్ సహకార సంఘంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అనంతగిరి సొసైటీ చైర్మన్ క్రిబ్ కో మెంబర్ డేగ బాబు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నీటిపారుదల పోరా సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమాలలో సంఘ సభ్యులు పి.వీరయ్య, సి హెచ్.విశ్వేశ్వరావు, బి.సత్యనారాయణ, కె.దాసు, కాశయ్య, అమీనా బాద్ మాజీ సర్పంచ్ ఎం.కోటేశ్వరరావు, సంఘ ఉద్యోగులు ఎన్.రామకృష్ణ మాజీ సీఈఓ ఎన్.సైదులు, వై. చిన్న కృష్ణ, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ చార్జీల పెంపు భారం పాపం బీఆర్ఎస్ దే

**కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి విద్యుత్ చార్జీలు పెంచకపోగా గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నాం**

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** పదేళ్లలో రాష్ట్ర ప్రజలపై 20 వేల కోట్ల విద్యుత్ భారం మోపిన కేసీఆర్ ప్రజా పాలనపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్న బీఆర్ఎస్ నేతలుకాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటిగడిచిన పది సంవత్సరాల కాలంలో కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలపై 20 వేల కోట్ల పైన విద్యుత్ భారం మోపి, రెండు మూడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరగొట్టి ఇప్పుడు తామేదో ఘనకార్యం చేసినట్టుగా విద్యుత్ చార్జీల పెంపును అడ్డుకుంటున్నామనడం హాస్యాస్పదం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్, నాన్ డొమెస్టిక్, అన్ని కేటగిరీల చార్జీలు ప్రతి సంవత్సరం పెంచాలా లేదా ఫిక్స్ చార్జీలు నిర్ణయించడానికి ఈఆర్సీ సమావేశం అవుతుందని దాని సందర్భంగా ప్రభుత్వం చార్జీల పెంపదల గురించి ఎటువంటి యోచన చేయలేదని ప్రజలకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజా పాలన కింద దాదాపు 50 లక్షల కుటుంబాలకు గృహ అవసరాల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతాంగానికి ఉచిత కరెంట్ అందిస్తుంటే కేవలం రాజకీయ ఉనికి కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్ నేతలు విద్యుత్ చార్జీల పెంపుదలా అని పుకార్ల సృష్టించి, వారిది వాళ్లే పాలాభిషేకాలు చేసుకోవడం వెర్రితనానికి, దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పద్ధతి మార్చుకోవాలని సూచించారు. డిస్కం లు ప్రతిపాదించిన 12 వేల కోట్ల చార్జీల పెంపు భారాన్ని వినియోగదారులపై పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని గుర్తు చేశారు.





# ఘనంగా పండు అశోక్ జన్మదిన వేడుకలు

పిఠాపురం, అక్టోబర్ 30 (డైలీ రిపోర్ట్) : పివి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఖండవల్లి లోవరాజు మాట్లాడుతూ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి రావు ఆశయాలను కొనసాగిస్తూ పివి రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ జన్మదినం సందర్భంగా కాకినాడలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆయన అభిమానులు, అనుచరులు నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా ఆయన పివి రావు మాల మహానాడు ద్వారా పండు అశోక్ కుమార్ చేసిన కృషి, సేవలు వివరించారు. దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలు పై అవిరళ కృషి చేసి ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఆంధ్రా మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, వర్గీకరణ వ్యతిరేక జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్దాంతపు కొండబాబు, బీఎస్పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు సుబ్బు భాయ్, ఎపి స్టూడెంట్ జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి బులిరాజు, వేళంగి సర్పంచ్ సవిలే రాజేష్, ఏనుగుపల్లి కృష్ణ, టిడిపి ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు కోడిగుడ్ల అప్పారావు, మాల మహానాడు నాయకుడు బచ్చల కామేష్, ఆంధ్రా మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి లింగం శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు మండల ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్



**గిద్దలూరు, అక్టోబర్ 31 ,డైలీ రిపోర్ట్:**ఈ దీపావళి గిద్దలూరు మండల ప్రజలందరి జీవితాలలో వెలుగులు నిండి, ప్రతి ఇంట దీపకాంతులతో సుఖసంతోషాలు వెల్లివిరవాలని కోరుకుంటూన్నాను. చీకటిని తరిమి కొట్టి వెలుగులు నింపే ఈ దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా... ఈ వెలుగుల పండగను జరుపుకోవాలని గిద్దలూరు మండల టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్ తెలిపారు.

## దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్




**ఈ** దీపావళి పండుగ గిద్దలూరు మండల ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు వహించాలని, దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన గిద్దలూరు మండల టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్ తెలిపారు

## టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

**గిద్దలూరు, అక్టోబర్ 31 ,డైలీ రిపోర్ట్:** గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశానుసారం గిద్దలూర్ మండలం ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ లో టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది ముఖ్యంగా ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ లో గిద్దలూరు మండల టీడీపీ నాయకులు ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా టీడీపీ సభ్యత్వం కోసం రూ.100 చెల్లిస్తే సరిపోతుందన్నారు .ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ టీడీపీ అధ్యక్షులు షేక్ పెద్ద మౌలాలి , టీడీపీ యూత్ నాయకులు బోధనబోయిన అరుణ్ యాదవ్, మునిస్వామి రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు



# ఇచ్చోడలో జోరుగా మైక్రో ఫైనాన్స్ కంపెనీలు...!









- ఏజెన్సీలో విచ్చలవిడిగా భారీగా వడ్డీ వసూల్
- దుకాణాల పేరుతో తేర్చిన మైక్రో ఫైనాన్స్ కంపెనీలు
- వారం పక్షం నెల వాయిదాల వసూళ్ల కోసం ప్రైవేటు సైన్యం
- రక్తం పిలుస్తున్న ప్రైవేటు కంపెనీలు
- పల్లెల్లో గ్రామాలలో పట్టణాలలో తిరుగుతూ ఆదివాసి అమాయక ప్రజలను మోసం చేస్తున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీలసంస్థలు,యాజమాన్యాలు
- ఏటా రూ.500కోట్ల వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- ఏజెన్సీలో రోడ్డున పడుతున్న సాధారణ మధ్యతరగతి కుటుంబాలు.




ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: ఏజెన్సీ ప్రాంతంలో మైక్రో ఫైనాన్స్ పేరుతో అడుగుపెట్టిన ప్రైవేటు కంపెనీలు వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజలను నిలువెల్లా దోచుకుంటున్నారు పేద ప్రజల ఆర్థిక అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు.అధిక వడ్డీ వసూలుచేసి పేదలజీవితాలను చిద్రం చేస్తున్నారు. పీన్ కేర్. బంధన్. సాక్షం గ్రామీణ క్రెడిట్ లిమిటెడ్, కరూర్ వైశ్య, స్పందన ,స్వమన్ టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్ కంపెనీ లాంటి సంస్థలు ఇచ్చోడలో దుకాణాలు తెరిచి వడ్డీ వ్యాపారం చేస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలనుండి సాగుతున్న ఈ వ్యాపారం పేదల ఆర్థిక వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కూలినాలీ చేసుకుంటున్న పేదల కష్టారితాన్ని వడ్డీల పేరుతో వడ్డీ వ్యాపారులకు ధారపోస్తున్నారు.వడ్డీల కారణంగా ఆర్థికంగా చిక్కి పోతున్నారు పేద జనం.వారం వాయిదా రాగానే మైకో ఫైనాన్స్ కంపెనీల ప్రైవేటు సైన్యం గ్రామాల మీద పడి బలవంతపు వసూలు చేస్తుంది. ఇంట్లో శవం ఉన్న డబ్బులు చెల్లించాల్సిందే. ఒక్కొక్క సంస్థ రెండు వేల నుంచి ఎనిమిది గ్రూపులకు రుణంసదుపాయంకల్పిస్తుంది.ఏజెన్సీలో దాదాపు లక్ష మంది మైక్రో ఫైనాన్స్ లలో రుణాలు పొందారు.ప్రారంభం 30 వేల రుణ పరిమితి విధించి తరువాత 50వేలరూపాయలు పెంచారు. మైక్రో ఫైనాన్స్ కంపెనీలు నేరుగా ఇళ్లల్లోకి మహిళలతో మాట్లాడి వారికి రుణం కట్టబెడుతున్నారు. రుణం తీసుకొని వాయిదా ప్రకారం చెల్లించకపోతే బలవంతంగా వసూలు చేస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారు. వాయిదాల వసూళ్లకు ఏర్పాటు చేసిన ప్రైవేట్ సైన్యం పేదలపై బల ప్రయోగానికి పాల్పడుతున్న సంఘటనలు విన వచ్చాయి.ఏజెన్సీ ప్రాంతంలో వడ్డీ వ్యాపారం చేసేందుకు అను మతులు లేకున్నామాయ మాటలతో అధికార యంత్రాన్ని బురిడీ కొట్టి మరీ వ్యాపారం చేస్తున్నారు.తెర్చిన దుకాణాలు 30 కిలోమీటర్ల పరిధిలో తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేస్తున్నాయి.పేదలు, గిరిజనులే లక్ష్యంగా వడ్డీ వ్యాపారం సాగుతుంది. ఏజెన్సీలో,ఇచ్చోడలో వడ్డీ వ్యాపారాన్ని ఈ సంస్థలు జోరుగా సాగిస్తున్నాయి.

అల్లం సాయికిరణ్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో

## రాజ్ పాకాల కు మద్దతుగా మోకిలా పోలీస్ స్టేషన్కు తరలివచ్చిన మండల బి ఆర్ ఎస్ నాయకులు




**శంకర్ పల్లి, అక్టోబర్ 30:(డైలీ రిపోర్ట్):** రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండల పరిధిలోని జనవాడ ఫామ్ హౌస్ లో జరిగిన సంఘటన లో ఫామ్ హౌస్ యజమాని రాజ్ పాకాల మోకిలా పోలీస్ స్టేషన్ బుధవారం వచ్చిన సందర్భంగా శంకర్ పల్లి మండల, మున్సిపల్ బి ఆర్ ఎస్ నాయకులు ఆయనకు మద్దతుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి మండల టిఆర్ఎస్ గండిచేర్ల గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేష్ లు మాట్లాడుతూ కక్షపూరితంగా రాజ్ పాకాలపై కేసు నమోదు చేశారని మండిపడ్డారు. నిజం త్వరలోనే తెలుస్తుందని రాజు పాకాల కు న్యాయం జరుగుతుందని వారన్నారు. మద్దతు పలికిన వారిలో మహారాజ్ పేట్ మాజీ సర్పంచ్ దోసాడ నరసింహారెడ్డి, మహాలింగాపురం మాజీ ఎంపిటిసి యాదగిరి, మిర్జాగూడ గ్రామ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు ఒగ్గు అంజయ్య తదితరులు ఉన్నారు.

## ఏలూరు జిల్లా ప్రజలకు దీపావళి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఢిల్లీ/ ఏలూరు 30 (డైలీ రిపోర్ట్):** ఏలూరు జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు మరియు మీడియా మిత్రులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో దీపావళి పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి పర్వదినం సిరుల తల్లి లక్ష్మీదేవి కృపాకటాక్షాలు ప్రతి ఇంటిపై కురిసి, ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. రైతులు, యువత, మహిళలకు కూటమి ప్రభుత్వంలో కొత్త అవకాశాలు కల్పిస్తూ వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎల్లప్పుడు తన అండదండలు ఉంటాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ దీపావళి కానుకగా దీపం పథకం ద్వారా అక్కాచెల్లెమ్మలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లులను ఉచితంగా అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల జీవితాల్లో నూతన వెలుగులు నింపారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఈ దీపావళి పండుగ కష్టాల చీకట్లు తొలగిపోయి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. చిన్నారులు, యువత బాణసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యువతకు సూచించారు.

## 1 నుండి 16వ తేదీ వరకు జరిగే కుటుంబ సర్వే విజయవంతం చేయాలి: ఎంపీడీవో వెంకయ్య గౌడ్

**శంకర్ పల్లిబీ అక్టోబర్ 30:(డైలీ రిపోర్ట్):** నవంబర్ 1 నుండి 16వ తేదీ వరకు జరిగే కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని శంకర్ పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ సర్వే ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలకం కానున్నదని చెప్పారు. అందరూ కచ్చితంగా ఈ కుటుంబ సర్వేలో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేందర్, మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు,గిరి రాజు, మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, ఏ పీఎం భీమయ్య, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707